

# లిటిల్ రాస్కెల్

## మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

**అప్పటిదాకా** ప్రాణం వుగ్గబెట్టుకుని కూర్చున్న బన్ని బింకంగా చెప్పింది.

తిరిగి వస్తుంటే రైలు పట్టాలు కనపడ్డాయి. వంగి నేలమీద బోర్లా పడుకుని చెవిని పట్టాలకి ఆనించి విన్నాడు.

"ఎందుకు అలా చేస్తున్నావ్? ఏమైనా వినపడుతోందిరా?"

బన్ని కూడా రాజేష్‌ని అనుకరించింది.

"రైలు ఎక్కుదాం నడవండి" చెప్పింది నీరజ యిద్దరినీ చేతులు పట్టుకుని లేపి, వాళ్ళ వంటికి అంటిన దుమ్ము దులిపి.

ముందర టిక్కెట్స్ కొనుక్కుని ఏనుగుని ఎక్కి ఓ రౌండ్ తిరిగారు. తరువాత 'స్వాన్ స్టేషన్'లో బయలుదేరే చిన్నపిల్లల రైలు ఎక్కారు. పిల్లలిద్దరూ ఆ ప్రయాణాన్ని ప్రయాణీకులకన్నా బాగా ఎంజాయ్ చేసారు.

"అవిగో ఏనుగులు, అవిగో జీబ్రాలు ఒకరికొకరు జంతువులని చూపించుకుంటున్నారు.

"ఈ జంతువులు లేకపోతే ప్రపంచం ఎంతో నిస్సారంగా వుండి వుండేది కదండి?" చెప్పింది నీరజ జిరాఫీ వంక చూస్తూ.

"నీతో ఇదే యిబ్బంది. అన్నీ ఎమోషనల్‌గా ఆలోచిస్తావు" చెప్పాడు సాంబశివరావు నీరజతో చేతిమీద గిల్లి.

చిన్నగా నవ్వింది నీరజ.

"మీకన్నా బాల్యానికి నేను కొద్దిగా దగ్గరకదా" బదులుగా అన్నది.

నాలుగూ ముప్పావుకి బయటకి వచ్చారు. అక్కడ ఆటో లేకపోవటంవల్ల దశరథరామయ్య, పిల్లలు ఆర్.టి.సి బస్సులో మదీనాదాకా వెళ్ళి అక్కడనుంచి ఆటోలో లలితానగర్ బయలుదేరారు.

"తాతయ్యా! జీబ్రా ఏ రంగులో వుంటుంది?" అడిగాడు రాజేష్.

"తెలుపు నలుపు రంగుల్లో"

"తెలుపా? నలుపా?"

దశరథరామయ్య బుర్రగోక్కున్నాడు.

"తెల్లరంగు మీద నల్ల గీతలు" చెప్పాడు.

"కాదు, నల్ల రంగుమీద తెల్లగీతలు" చెప్పింది బన్ని వెంటనే.

రాజేష్ చిరునవ్వు నవ్వి చెప్పసాగాడు.

"ఆఫ్రికా అడవుల్లో ఓ రోజు ఓ జీబ్రా పిల్ల చెట్టునీడలో పడుకుని నిద్రపోతుంటే దానికి రంగురంగుల కలలొచ్చాయి. అలా కలలు కంటూంటే, అకస్మాత్తుగా ఓ సూర్యకిరణం గాలికి కదిలిన చెట్ల ఆకుల్లోంచి తోకమీద పడింది. దాని పొట్టమీదనుంచి, మెడమీదనుంచి తిరిగి దాని నలుపు గీతలమీంచి కళ్ళలోకి పడింది. వెంటనే ఆ జీబ్రా పిల్లకి మెలుకువ వచ్చేసింది. చూస్తే తోకమీద వుంది ఆ సూర్య కిరణం. తోకమీద తెలుపు, నలుపు రంగుల గీతలు."

"నేనేం రంగు? తెలుపా? నలుపా? తెలుపు మీద నల్లగీతలా లేక తెలుపు మీద తెల్లగీతలా? అనుకుంది. దాని వంటిమీద నలుపు గీతలని, తెలుపు గీతలని లెక్కపెట్టసాగింది. తోకమీద, కాళ్ళమీద, పొట్టమీద గీతలు లెక్కపెట్టింది. కానీ చెవులమీద, మొహం మీద గీతలు కనపడవుగా. దగ్గరేవున్న ఓ నది దగ్గరకి పరిగెత్తుకెళ్ళి నీళ్ళలో తన ప్రతిబింబం చూస్తూ లెక్కపెట్టింది. నలభై ఆరు నలుపు... నలభై ఆరు తెలుపు.. నలభై ఏడు నలుపు.. నలభై ఏడు తెలుపు.. నలభై ఎనిమిది నలుపు... నలభై ఎనిమిది తెలుపు.."

తీరా చూస్తే రెండు రంగులూ సమానంగానే వున్నాయి.

ఊపిరి తీసుకోడానికి ఆగాడు రాజేష్.

"జీబ్రాలకి ఎక్కడయినా లెక్కపెట్టడం వస్తుందా?" మూతి తిప్పింది బన్ని.

రాజేష్ మళ్ళీ అందుకున్నాడు.

"ఇదేమిటి? నా వంటి రంగేమిటో నాకే తెలియదు. ప్రతీ జంతువుకి ఓ రంగంటూ వుంది" అనేసింది.

నది వద్దనే కనబడ్డ మొసలిని అడిగింది "మొసలి మామా, నేనేం రంగో చెప్తావా?" అని. అది జీబ్రాని ఎగాదిగా చూసి "తెలుపు మీద నల్లచారలున్న రంగు నీది" అన్నది.

జీబ్రా హడావుడిగా బయలుదేరింది. తెలుపుమీద నల్లచారలా? తెలుపు రంగయితే త్వరగా మాసిపోతుంది. రోజూ నాలుగైదుసార్లు స్నానం చెయ్యాలి. రాత్రివేళ పులులు, సింహాలు తన తెల్లరంగు బట్టి తన ఉనికిని కనిపెట్టేయగలవు. అది చాలా ప్రమాదం.

జీబ్రాకి కుందేలు కనిపించింది. ఆగి దాన్ని అడిగింది.

"కుందేలు బావా నేనేం రంగో చెప్తావా?"

కుందేలు జీబ్రాని పరీక్షించి చూసి చెప్పింది.

"నలుపు రంగు నీది. కానీ ఆ నలుపు మీద తెల్ల చారలున్నాయి.." మళ్ళీ హుషారుగా బయలుదేరింది జీబ్రా. నలుపు రంగు నల్లరంగు విచారానికి గుర్తు. ఎవరైనా కోపగిస్తే నల్ల జండాలతో ఊరేగింపు చేస్తారు. ఎండలో నల్లరంగు ఎక్కువ వేడిని ఆకర్షిస్తుంది. తెలుపయితేనే బాగుంటుంది. తెల్లవాళ్ళకి స్నేహితులు ఎక్కువమంది దొరుకుతారు."

దానికి ఓ తాబేలు కనిపించింది.

"తాబేలు తాతా తాబేలు తాతా నా వంటి రంగేదో సరిగ్గా చూసి చెప్పు" అడిగింది.

తాబేలు ఆ మాటలు విని చిన్నగా నవ్వింది. నవ్వినా అది జీబ్రా చూడలేదు. ఎందుకంటే తాబేలు నోరు చాలా చిన్నదికదా. కనపడదన్నమాట.

"జీబ్రా మనవడా! వంటిరంగు నలుపా లేక తెలుపా అన్నది ముఖ్యవిషయం కాదు. చుక్కలున్నాయా, గీతలున్నాయా, పెద్దవా, చిన్నవా, అందమా, అనాకారితనమా అన్నది అసలు ఎంతమాత్రం ముఖ్యంకాదు. మనందరికీ

ముఖ్యమయినదేమిటంటే, మంచితనంతో దయగలిగి వుండటం. ఇతరులకి సహాయం చేయటం. అప్పుడే అంతా నిన్ను ప్రేమిస్తారు. నువ్వే రంగో ఎవరికి కావాలి?''

తాబేలు తాతయ్య నీళ్ళల్లో దిగి పాకుతూ వెళ్ళిపోయింది. జీబ్రా ఆ మాటకి సంతృప్తిపడి తనే రంగు అన్న విషయం మర్చిపోయి ఇతరులకి సహాయం చేస్తూ మంచిగా జీవించసాగింది.''

''బావుందిరా'' చెప్పింది బన్ని మెచ్చుకోలుగా.

ముందురోజు రాత్రే అడ్మిట్ అవాలి కాబట్టి రాత్రి ఎనిమిదిన్నరకి దశరథరామయ్య, రాజేష్‌లని హాస్పిటల్లో దిగబెట్టి వచ్చారు నీరజ, సాంబశివరావులు. నిద్రపోయేదాకా రాజేష్ తను జూలో చూసిన జంతువులని నెమరువేసుకుంటూనే వున్నాడు. సర్కస్ బావుంటుందా లేక జూ బావుంటుందా అని ఆలోచించసాగాడు. సర్కస్ అయితే జంతువులు రకరకాల ఫీట్స్ చేస్తాయి. కాని దగ్గరనించి చూడటం కుదరదు. జూలో అయితే వాటిని బాగా దగ్గరనించి చూడొచ్చు. కానీ అవి పిలిచినా పలకవు, దగ్గరకి రావు. ఎటూ తేల్చుకోలేక నిద్రలోకి జారిపోయాడు.

ఆ రాత్రి దశరథరామయ్యకి త్వరగా నిద్రపట్టలేదు. అలసిపోయి నిద్రపోతున్న రాజేష్ వంక చూస్తూ చాలాసేపు మేలుకునే వున్నాడు. రాజేష్ చెప్పిన జీబ్రాకథ గుర్తుకి వస్తోంది. తన కొడుకు మనసు రంగు తెలుపా? నలుపా? నిజం చెప్పాడా? అబద్ధం చెప్పాడా?

రాజేష్ బొడ్డుకింద, నాభి దగ్గర స్టెరిలైజ్ చేయబడ్డ కత్తులు రక్తనాళాలని కోసుకుంటూ కొన్ని గంటల్లో కిందకి దిగుతాయి. అప్పుడు మత్తులో వున్నా కొన్ని గంటల తర్వాత స్పృహ వస్తుంది. అసలు మళ్ళీ స్పృహ వస్తుందా లేక తన ఆలోచనకి వణికిపోయాడు దశరథరామయ్య. లేచి మంచినీళ్ళు తాగి నిద్రకోసం ప్రయత్నించాడు. కానీ ఫలించలేదు.

రాజేష్‌ని కన్నతల్లి ఎవరు? ఎక్కడుంది? ఎలా వుంది? ఎందుకు ఇక్కడికి పంపింది? సాంబశివరావు చెప్పింది నమ్మొచ్చా? ఈ సంగతి తెలిస్తే సావిత్రే యిప్పుడు ఇక్కడుంటే ఏం చేస్తుంది? ఎలా రియాక్ట్ అవుతుంది?

రాత్రి పదిగంటలు దాటాక ఎప్పుడో నిద్రవచ్చింది ఆయనకి.

సాంబశివరావు, నీరజల మానసిక స్థితి అలాగే వుంది. ఇద్దరూ ఒకరిమీద ఒకరు చేతులు వేసుకుని పడుకున్నా ఎవరి ఆలోచనలలో వారున్నారు.

నీరజకి ఆశ్చర్యంగా వుంది. తన భర్త కొడుకూ, తన భర్తకి, మరో స్త్రీకి వున్న శారీరక సంబంధాన్ని గుర్తుచేసే రాజేష్‌మీద తనకి ద్వేషం కలగాలన్నా కలగడంలేదు. తనలో అసూయ లేదా? వుంది. లేదేమో? సావిత్రిని ముఖాముఖి చూస్తేకానీ తనకి ఈర్ష్య వుందో లేదో తేల్చుకోలేదు.

ఎదుటివారున్న ఉన్నత స్థితికి చేరుకోలేమనే మానసిక బలహీనతలోంచే ఈర్ష్య. అసూయలు పుడతాయి. తనకన్నా అందమైన అమ్మాయిని చూస్తే మరో స్త్రీకి ఈర్ష్య. అందుకే సావిత్రి పొందాల్సిన దాంపత్య జీవితం తను పొందుతున్నందుకా. తను ఆ విషయంలో వున్నతంగా వున్నాననా సావిత్రిమీద అసూయలేదు? తనకి రాజేష్‌లాంటి కొడుకు పుడతాడనే నమ్మకం వల్లా రాజేష్ మీద ద్వేషం, అసూయ కలగడంలేదా?

కాదు. రాజేష్‌లోని మంచితనం, అమాయకత్వం, క్రమశిక్షణ.. తన భర్తకి నిద్రపట్టలేదని తెలుసు నీరజకి.

''ఏం ఆలోచిస్తున్నారు?'' అడిగింది తెలుసుకోవలని.

''జీవితం గురించి'' చెప్పాడు సాంబశివరావు. కంఠంలో అంత దిగులు ఎప్పుడూ ధ్వనించగా వినలేదు నీరజ.

అనుమానంగా అతని జుట్టుమీద చేతిని వేసి చేత్తో రాస్తూ చెప్పింది.

"ఏమైంది మీ జీవితానికిప్పుడు?"

"నా జీవితం గురించికాదు, రాజేష్ జీవితం గురించి. ఆపరేషన్ సక్సెసవుతుందో, ఫెయిల్ అవుతుందో అన్నది మానవుడి చేతుల్లో వుండదుగా"

"మీ అబ్బాయికేం కాదు. గాడ్ ఈజ్ గ్రేట్."

ఆ రాత్రి సాంబశివరావు 'గుడ్‌నైట్' చెపుతూ కూడా పొరపాటునయినా నీరజని ముద్దుపెట్టుకోలేదు.

ఆపరేషన్ టేబిల్‌మీద అపస్మారక స్థితిలో వున్న రాజేష్, ఎలక్ట్రిక్ దీపాలకి తళుక్కున మెరిసే స్టెయిన్‌లెస్ స్టీల్ కత్తులని వుపయోగించే గ్లవ్స్ తొడుక్కున్న చేతులు, ఆ గ్లవ్స్‌కి అంటిన ఎర్రటి రక్తం మాటిమాటికీ అతని కళ్ళముందు తిరుగుతున్నాయి.

ఆ రాత్రి ఒక్క నిముషం కూడా ఆ యింట్లో నిద్రపోనిది ఒక్క సాంబశివరావే.

18

ఉదయం అయిదున్నరకి మెలుకువ వచ్చింది. దశరథరామయ్యకి. కొత్త చోటులో వుండటంతో క్షణకాలం గుర్తురాలేదు. క్రితం రాత్రి తను హాస్పిటల్‌కి రాజేష్‌కి తోడుగా వచ్చి పడుకున్నానని. ఆ సంగతి స్ఫురణకి రాగానే మంచంమీద తన పక్కన పడుకున్న రాజేష్‌ని లేపాడు. ఇద్దరూ కాలకృత్యాలు తీర్చుకునేలోగా పేపర్ వచ్చింది.

"తాతయ్యా! నాకు ఆపరేషన్ చేస్తున్నారు కదూ?" అడిగాడు రాజేష్ బెరుకుగా.

"లేదు" చెప్పాడాయన పేపర్‌లో మొహం దాచుకుని.

"మరయితే ఇక్కడ దేనికి చేర్పించినట్లు?"

"నీకు ఎక్స్‌రేలు తీయడానికి."

"నిజంగానే నా మీద ఒట్టు."

"నీమీద వొట్టా. సరే అయితే."

రాజేష్ తనతో తెచ్చుకున్న టింకూ ఇల్లుగా వుపయోగించే కార్టన్‌ని తెరచి అందులోని టింకూని తన చేతిమీదకి ఎక్కించుకున్నాడు. రాజేష్ కూజా వంచుకుని మంచినీళ్ళు తాగబోతుంటే చెప్పాడు దశరథరామయ్య కంగారుగా.

"వద్దు, డాక్టర్ వద్దన్నారు."

"దాహంగా వుంది తాతయ్యా"

"డాక్టర్ వచ్చి చూసి వెళ్ళాక తాగుదువుకాని" చేతిలోంచి గ్లాస్‌ని తీసుకుని ఆ నీళ్ళని మళ్ళీ కూజాలో పోసి గ్లాసుని మూత పెట్టాడు ఆ కూజాకి. ఉదయం ఎనిమిదిన్నరకి సికింద్రాబాద్ నర్సింగ్ హోమ్ ముందు సాంబశివరావు స్కూటర్‌ని ఆపాడు నీరజ. అతను ఫస్ట్‌ఫ్లోర్‌లోని రూం నెంబరు పన్నెండులోకి వెళ్ళారు.

రాజేష్ బాల్కనీలో కూర్చుని బయట ట్రాఫిక్ వంక చూస్తున్నాడు. ఆ కుర్రాడి భుజం మీద టింకూ. దశరథరామయ్య పేపర్ చూస్తున్నాడు.

"గుడ్ మార్నింగ్ టు యూ బోత్" చెప్పాడు. రాజేష్ వారిద్దరినీ చూసి నవ్వుతూ.

"గుడ్ మార్నింగ్" యిద్దరూ తిరిగి విష్ చేశారు.

"మంచినీళ్ళు తాగావా?" అడిగింది నీరజ రాజేష్‌ని.

"లేదు" చెప్పాడు దశరథరామయ్య.

"వచ్చేదాకా అదే భయం నాకు" చెప్పింది నీరజ.

"డాక్టర్ యింకా రాలేదా?" అడిగాడు సాంబశివరావు.

"పదిన్నరకి వస్తారట."

"ఇంకా రెండు గంటలు" చెప్పాడు రాజేష్ నీరసంగా. సాంబశివరావు బయటికి వెళ్ళాడు. నీరజ పేపర్‌లోని ఓ కాగితాన్ని తీసుకుని చదవసాగింది.

ఉదయం తొమ్మిదిన్నరకి రౌండ్స్ వచ్చిన హాస్పిటల్ డాక్టర్ రాజేష్ టెంపరేచర్ చెక్ చేసి, ఛార్ట్‌లో రాసి వెళ్ళాడు.

"కొద్దిగా మంచినీళ్ళు తాగుతాను. దాహంగా వుంది" చెప్పాడు రాజేష్ పదింబావుకి.

"వద్దు. ఇంకో పావుగంట ఓపిక పట్టు" చెప్పింది నీరజ.

పదకొండూ అయిదుకి వచ్చాడు డాక్టర్ శశిభూషణ్.

"వాట్ యంగ్‌మేన్. హౌ ఆర్ యూ?" అడిగాడాయన రాజేష్ నాడి చూస్తూ.

"ఫైన్. ఐ యామ్ థర్స్టీ" చెప్పాడు రాజేష్.

"నువ్వు మంచినీళ్ళు తాగితే, మత్తుమందు ఇచ్చినప్పుడు వామిట్ అవుతుంది ఆపరేషన్ అయ్యాక కావలసినంత తాగుదువుగాని."

"ఆపరేషనా?" ఉలిక్కిపడ్డాడు.

"కాదు ఎక్స్‌రే తీస్తారు. కదూ డాక్టర్?" అంది నీరజ నర్మగర్భంగా నవ్వుతూ.

ముందర శశిభూషన్‌కి అర్థంకాలేదు ఆ సంభాషణలోని అంతరార్థం. అయ్యాక చెప్పాడు.

"మర్చిపోయాను, రేపు ఆపరేషన్. ఇవాళ కాదు."

ఒకటిన్నరకి ట్రాలీ వచ్చింది గదిలోకి. రాజేష్‌ని ట్రాలీలో పడుకోబెట్టి కారిడార్‌లో తీసుకెళ్ళసాగారు. వెనకాలే నీరజ, సాంబశివరావు, దశరథరామయ్య నడిచారు.

'ఆపరేషన్ థియేటర్ నంబర్ టు' అన్న అక్షరాలున్న గదిలోకి తనని తీసుకెళ్ళడం గమనించాడు రాజేష్ ట్రాలీమీంచి దూకి వెనక్కి పరుగు లంకించుకున్నాడు.

"తాతయ్యా, నాకు ఆపరేషనా? నీమీద వట్టేశావ్?" అడిగాడు బయటకు వచ్చి వగరుస్తూ.

డాక్టర్ శశిభూషణ్ బయటకు వచ్చి చెప్పాడు రాజేష్ చేతిని పట్టుకుని.

"ఆపరేషన్ రేపన్నాగా, ఇప్పుడు నీకు ఎక్స్‌రే తీస్తాం అంతే."

"నాకు ఎక్స్‌రే వద్దు."

నీరజ చేతిని పట్టుకున్నాడు భయంగా.

"మీరు రండి పిన్నీ" పిల్చాడు.

"ఆడవాళ్ళు లోపలికి రాకూడదు. రా. నేనున్నాగా" శశిభూషణ్ రాజేష్‌ని ఎత్తుకుని లోపలికి తీసుకెళ్ళాడు.

"తాతయ్యా! నిజంగా ఆపరేషన్ అయితే నీ ఒట్టుతీసి గట్టుమీద పెట్టు" అరిచాడు రాజేష్. ఆ స్వరంలో ఏడుపు మిళితమై వుంది.

ఆపరేషన్ థియేటర్ వంక, ఆపరేషన్ టేబుల్ మీద వెలిగే లైట్ల వంక, రకరకాల పనిముట్ల వంక గ్లవ్స్ తొడుక్కునున్న తెల్లటి యూనిఫారాలలోని నర్సులవంక, స్టాండ్ నించి వేలాడుతున్న రక్తం బాటిల్, గ్లూకోస్ వాటర్ బాటిల్ వంక భయంగా చూడసాగాడు.

శశిభూషణ్ రాజేష్‌ని టేబుల్ మీద పడుకోబెట్టాడు.

"ఎన్నేళ్ళు నీకు?" అడిగాడు.

"ఏడు" చెప్పాడు ఏడుపునాపుకుంటూ.

"మీ తాతయ్యకి?"

"ఏమో? అరవై"

"హిస్టరీలో నీ మొదటి లెసన్ ఏమిటో గుర్తుందా?"

"ఓ! నెపోలియన్ బోనపార్టి గురించి."

"ఎవరతను?"

"ఫ్రెంచ్ రాజు."

"ఇంగ్లీషులో మొదటి లెసన్ గుర్తుందా?"

"ఆఁ కలర్ ది ఫ్లవర్స్ విత్ క్రియాన్స్."

"ఏ మేం ఫ్లవర్స్ వున్నాయి?"

శశిభూషణ్ రాజేష్‌ని మాటల్లో పెట్టి చొక్కా, బనీను, నిక్కరు తీసేశాడు.

"ఛీ! ఛీ" చెప్పాడు రాజేష్ సిగ్గుపడుతూ.

"మరేం ఫరవాలేదు. ఒన్, టూ, త్రీ, ఫోర్ చెప్పు" అన్నాడు ఎనస్తీషియన్.

రాజేష్ ఆయన చేతిలోని ఇంజక్షన్‌ని చూసి అడిగాడు.

"మళ్ళీ ఇంజక్షనా యిక్కడ కూడా?"

"ఇది నొప్పి పుట్టదు."

రాజేష్ చేతికి ఆ ఇంజక్షన్ ఇచ్చాడు ఎనస్తీషియన్.

"నాకేదో అవుతోంది" చెప్పాడు రాజేష్ మగతగా. వెంటనే మందు పనిచెయ్యడంతో మత్తులోకి జారిపోయాడు.

నర్స్ స్పిరిట్‌లో ముంచిన దూదితో రాజేష్ బొడ్డుకింద శుభ్రంగా తుడిచింది. శశిభూషణ్ చేతికి స్కాల్‌సెల్ అందించింది మరో నర్స్.

"మే గాడ్ బ్లెస్ దిస్ పేషెంట్" అలవాటుగా చెప్పి డాక్టర్ శశిభూషణ్ స్కాల్‌సెల్‌తో రాజేష్ బొడ్డుకింద స్వల్పంగా అర్ధచంద్రాకారంలో కోసాడు. రక్తం చిందగానే నర్స్ దూదిపేడ్స్‌ని అక్కడ అద్దింది.

శశిభూషణ్ అలవాటయిన చేతులు ఎంతో నైపుణ్యంగా తమ పని తాము చేసుకుపోసాగాయి.

ఆపరేషన్ థియేటర్ బయట నిలబడివున్న నీరజ, సాంబశివరావులు దూరంగా కనబడే స్కై స్క్రేపర్స్‌ని చూస్తున్నారు. ఇద్దరి మనసులనిండా అనీజినెస్, టెన్షన్, ఆదుర్దా.

కాస్సేపాగి చెప్పాడు సాంబశివరావు నీరజతో.

"నేను గదిలో వుంటాను. అవసరమైతే పిలు."

దశరథరామయ్య అయిదు నిముషాల తర్వాత మేడదిగి రోడ్డుమీదకు వెళ్ళి ఓ చుట్ట అంటించి గుప్పుగుప్పున పొగ వదులుతూ దాన్ని తాగసాగాడు.

నీరజ అంతకు మునుపెన్నడూ ఎరగని మానసిక స్థితిలో వుంది. మనస్సునిండా ఎంతో సున్నితమైన బాధ. వేలి అంచులకి పదునైన బ్లేడు అంచు తగిలి దిగితే కలిగే బాధలాంటి సున్నితమైన బాధ.

చిట్ట చీకటి. చిమ్మచీకటి. కాటికలాంటి చీకటి. ఎక్కడ చూసినా చీకటి.

చీకట్లో దూరంగా ఏదో చుక్క. తెల్లటి చుక్క. వెలుగు చుక్క. ఆ వెలుగు చుక్క క్రమక్రమంగా పెద్దదవుతోంది. కాదు, దగ్గరవుతోంది. కాదు. ఆ చుక్క దగ్గరకి వెళ్తున్నాడు.. దూరంనించి చిన్నదిగా చుక్కలా కనబడే ఆ వెలుగు దగ్గరకి పయనిస్తున్నాడు.

సొరంగం అవును. సొరంగమే. ఆ సొరంగం నిండా చీకటి. అది అంతమయ్యేచోట వెలుగు. గాలిలో తేలుతూ పయనిస్తున్నాడు. అలా వెళుతూంటే ఎంతో ప్రశాంతంగా, హాయిగా వుంది.

ఎవరది?

నాలుగు తలలు, ఎనిమిది చేతులు.

బ్రహ్మదేముడు.

చేతులు ముకుళించాడు.

శ్రీరామ శ్రీరామ శ్రీరామ శ్రీరామ..

తాతయ్యలా వున్నాడా? నాలుగు తలలు కాదు. ఒక్క తలే, బ్రహ్మకాదు తాతయ్య. తెల్లటి గడ్డం, తెల్లటి మీసం.

కాదు. కాదు.

నాలుగు తలలు బ్రహ్మే. బ్రహ్మకి కూడా గడ్డం వుంటుందా? ఆయనకుండేమిటి?

"చెప్తా నాయనా."

ఎవరు మాట్లాడారు?

"చూడు, ఇంతవరకు నేను ఎన్నో జంతువులని సృష్టించాను. ఈ అవయవాలు మిగిలిపోయాయి. వీటినేం చేయాలి? అవును.. వీటన్నిటినీ కలిపి ఓ కొత్త జంతువుని సృష్టించాలి. అన్నీ వున్నాయాలేవా అంటావా? చూద్దాం. ముందర కాళ్ళా? అవును. కాళ్ళు ఎంత పొడుగ్గా వున్నాయో చూసావా? అవును. ఇవి ఒంటె కాళ్ళే తలా? అవునవును. ఇది లేడితలే.. సరే. మరి తోక? నిజమే సుమా. ఇది పెద్దపులి తోకే చర్మం. చర్మమేది? ఇక్కడుందా? భలేకనిపెట్టేశావే. ఇది చిరుతపులి చర్మమే. దీన్ని కప్పుదాం. పోతే మెడ. మెడ.. ఏది? లేదా? సరే. కొత్తది చేద్దాం. నేను ఇంతదాకా ఇంతపొడవు మెడ సృష్టించలేదు చూశావా? మరి పొట్ట? ఇదిగో గుర్రం పొట్ట ఒకటి మిగిలివుందిగా. ఇప్పుడు అన్నీ వచ్చేశాయా లేదా? సరిగ్గా చూడు. వచ్చేశాయా? గిట్టలా? జీబ్రా గిట్టలు. వీటిని తగిలిద్దాం. బావుందా ఈ కొత్త జంతువు? ఏమిటి పేరా? దీని పేరు ఏం పెడదాం? నీకు తెలుసా? చెప్పుకో చూద్దాం? జిరాఫీ? జిరాఫీ? జిరాఫీ? అలాగే పిలుద్దాం. వేటివేటితో ఈ జిరాఫీని తయారుచేశానో చెప్పుకో? ఒంటె కాళ్ళు, చిరుతపులి చర్మం, జింక తల, గుర్రం పొట్ట, పులితోక, పొడుగాటి మెడ, జీబ్రా గిట్టలు. భలే కొత్త జంతువు సృష్టించేశాను. ఏమిటేమిటి? దీనికి మెడ అంత పొడుగ్గా ఎందుకుండాలంటావా? మరి తల

అంత ఎత్తులో వుందిగా. ఆ తల శరీరం నించి పడిపోకుండా వుండాలంటే అంత పొడవు మెడ అవసరం కదా మరి. ఏమిటి? ఎందుకు నవ్వుతున్నావ్? జిరాఫీ మీద ఎక్కుతావా? సరే. అలాగే కాని.. ”

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

www.anandbooks.com
www.telugubooks.in